నాడు మిథిలానగర్‌లో వరద నీటిలోంచి నడుస్తూ ముంపు సమస్యను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి (ఫైల్)

ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి (ఫైల్)

ముంపునకు చెక్

● బీఆర్ఎస్ హయాంలో భారీగా నిధులు ● రూ.178 కోట్లతో ఎస్ఎన్‌డీపీ నాలా పనులు

బడంగ్‌పేట, సెప్టెంబర్22: బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక విజన్‌తో పనిచేసి ఎంతటి విపత్తునైనా ఎదుర్కోవచ్చునని ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు ద్వారా నిజం చేసింది. గడిచిన కొన్ని రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలో ఎక్కడ కూడా వరద ముప్పు లేకుండా పోయింది. గతంలో చిన్న పాటి వర్షానికి లోతట్టు కాలనీలన్ని జలమయంగా మారేవి. సహాయం చేయడానికి ఎవరు వస్తారని ఎదిరుచూసే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు కింద మహేశ్వరం నియోజక వర్గంలోని బడంగ్‌పేట, మీర్‌పేట, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలలో రూ. 178,95 కోట్లు కేటాయించారు. దాదాపుగా 13,110 మీటర్ల మేరకు ఎస్ఎన్‌డీపీ నాలాలను ఏర్పాటు చేయడంతో ముంపు కష్టాలకు శాశ్వతంగా పరిష్కారం లభించింది. మహేశ్వరంలో ముంపు సమస్య ఉండకూడదన్న ఉద్దేశంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ హయాంలో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకుపోయారు. సమస్యను గుర్తించిన కేసీఆర్, అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నిధులు కేటాయించారు. ఎస్ఎన్‌డీపీ నిధులతో వరద కాల్వలను ఏర్పాటు చేయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చివరి దశకు వచ్చిన పనులను కొన్ని చోట్ల నిలిపి వేశారు. ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనులను చేయడానికి నిధులు నిలిపివేయడంతో కొన్ని చోట్ల పనులు ఆగిపోగా మరి కొన్ని చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎస్ఎన్‌డీపీ ఫేస్ -2 కు నిధులు కేటాయిస్తే భవిష్యత్‌లో కూడా వరద ముంపు ఉండదు.

వర్షం వస్తుందంటేనే వణుకు పుట్టేది..

నాడు వర్షం వస్తుందంటేనే లోతట్టు ప్రాంతాల ప్రజలకు వణుకు పుట్టేది. కాలనీలన్ని జలదిగ్బంధంలో ఉండేవి. ఇండ్లలో ఉన్న నిత్యావసర సరుకులతో పాటు సర్వం కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేవారు. వర్షం కాలం వచ్చిందంటే ఏ క్షణాన ప్రమాదం వస్తుందోనని భయ భ్రాంతులకు గురి రయ్యేవారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయి బాలాజీనగర్, నవయుగ కాలనీ, లక్ష్మీనగర్, మధురానగర్, జయశంకర్ కాలనీ, శివనారాయణ పురం తదితర, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథిలానగర్, సత్యసాయి నగర్, కమలానగర్, ఎంఎల్ఆర్ కాలనీ, ఎస్ఎల్‌నెస్ కాలనీ, శ్రీధర్ కాలనీలు, జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని క్యూబా కాలనీ, షాహిన్ నగర్, తదితర కాలనీలో జలమయంలో ఉండేవి.

బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎన్‌డీపీ నిధులు..

బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ నిధుల ద్వారా వరద కాల్వలను ఏర్పాటు చేశారు. నాలాల పనులు పూర్తి చేసిన తర్వాత వరద ముంపు తప్పింది. వారం రోజులుగా భారీ వర్షాలు కురిసినా వరద నీరు సాఫీగా పోతుంది. ముంపు సమస్య తీరడంతో కాలనీల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరద నీరు కాలనీల్లోకి రాకపోవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేయడం కారణంగానే వరద రాలేదని కాలనీ వాసులు అంటున్నారు. మిగిలిన ఎస్ఎన్‌డీపీ పనులను పూర్తి చేయించాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ముంపు సమస్య ఉండొద్దనేది నాకల

నియోజక వర్గంలో ముంపు సమస్య ఉండకూడదనేది నా కల. వర్షం వస్తుందంటే భయపడేది. ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్, గత మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకుపోయా. మీర్‌పేట, జల్‌పల్లి, బడంగ్‌పేట వరద పరిస్థితిని గమనించిన కేసీఆర్ చలించిపోయారు. ఎస్ఎన్‌డీపీ ద్వారా నిధులు కేటాయించారు. రూ.178 కోట్లతో పనులు చేపట్టాం. పనులు చివరి దశకు వచ్చాయి. కొన్ని చోట్ల పెండింగ్‌లో ఉన్నాయి. అవి పూర్తి చేస్తే మీర్‌పేట, బడంగ్‌పేటకు ముంపు సమస్య ఉండదు. కేసీఆర్, కేటీఆర్‌కు ధన్యవాదాలు.

– ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో..

కాలనీల పేర్లు	నిధులు	మీటర్లు
సుమా ప్యారడైజ్ నుంచి సితా మెడోస్,	రూ. 10 కోట్లు	30 మీటర్లు
లిబ్రా ఎన్‌క్లేవ్ నుంచి పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్ వరకు	రూ.6,79 కోట్లు	200 మీటరు
మారుతీనగర్ నుంచి శివనారాయణ పురం వరకు	రూ.4,69కోట్లు	140 మీటర్లు
పెద్ద బావి గార్డెన్ నుంచి సితాహోమ్స్ వరకు	రూ.9,90 కోట్లు	70 మీటర్లు
గ్రీన్ రిజ్ ఎవెన్యూ నుంచి మీర్‌పేట వరకు	రూ.8,71 కోట్లు	350 మీటర్లు
పోచమ్మ కుంట నుంచి మీర్‌పేట తలాబ్ వరకు	రూ.14,28 కోట్లు	180 మీటర్లు
కోమటి కుంట చెరువు నుంచి మీర్‌పేట తలాబ్	రూ.9,66 కోట్లు	–
మొత్తం	**64.5 కోట్లు**	**970**

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ఫేస్ -1లో..

సాయి నగర్ కాలనీ నుంచి లెనిన్ నగర్ వరకు	రూ. 8,21 కోట్లు	779 మీటర్లు
మిథిలానగర్ నుంచి న్యూ వివేక్ నగర్ వరకు	రూ. 4,26కోట్లు	406 మీటర్లు
గాయిత్రీ నగర్ నుంచి నందిహిల్స్ వరకు	రూ.15,34కోట్లు	664 మీటర్లు
టీచర్స్ కాలనీ నుంచి గాయిత్రీ నగర్ నందిహిల్స్ వరకు	రూ.27,70కోట్లు	4,020 మీటర్లు

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ఫేస్ ఫేస్ 2లో..

మీర్‌పేట బూర్జు నుంచి గౌతమి నగర్ వరకు	రూ.3,4కోట్లు	666 మీటర్లు
మీర్‌పేట బూర్జు నుంచి వెంటగిరి కాలనీ వరకు	రూ.1,65కోట్లు	362 మీటర్లు
మొత్తం	**రూ.60,22 కోట్లు**	**1,028 మీటర్లు**

జల్‌పల్లి మున్సిపాలిటీ లో..

అర్బత్ కాలనీ నుంచి గుర్రం చెరువు వరకు	రూ.23,35కోట్టు	2489 మీటర్లు
కుమ్మరి కుంట నుంచి మజీద్ వరకు	రూ.1,33కోట్టు	247 మీటర్లు
కొత్త పేట నుంచి నబీల్ కాలనీ వరకు	రూ.3,13కోట్టు	686 మీటర్లు
రాయల్ కాలనీ నుంచి గుర్రం చెరువు వరకు	రూ.7,24కోట్లు	705 మీటర్లు
మొత్తం	**రూ.34.87కోట్లు**	**4127 మీటర్లు**

తుక్కుగూడ మున్సిపాలిటీలో..

సూరం చెరువు నుంచి కెనరా బ్యాంక్ వరకు	రూ.6,95కోట్లు	430 మీటర్లు
కెనరా బ్యాంక్ ఏటీఎం నుంచి బొమ్మకుంట చెరువు వరకు	రూ.12,40కోట్లు	686 మీటర్లు
మొత్తం	**రూ. 19.36 కోట్లు**	**1116 మీటర్లు**
ఎస్ఎన్‌డీపీ నిధుల మొత్తం	**రూ. 178.95 కోట్లు**	**13,110 మీటర్లు**

ఉత్సాహంగా సైనథాన్ రన్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 22: అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని బాలయోగి అథ్లెటిక్ క్రీడాస్టేడియంలో ఆశ్రయ్ ఆకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'సైనథాన్-2024' రన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. క్వాల్కాం సంస్థ టెక్నాలజీ, పెటెంట్ కౌన్సిల్ సీనియర్ డైరెక్టర్ నితిన్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్న వ్యక్తులు వారి మానవ హక్కులు వినియోగించుకోవడం లక్ష్యంగా ప్రతియేటా సెప్టెంబర్ 23న ప్రపంచ సంకేత భాషల దినోత్సవం నిర్వహించుకోనున్నుట్లు తెలిపారు. ఆశ్రయ్ ఆకృతి వ్యవస్థాపక డైరెక్టర్ డీపీకే బాబు మాట్లాడుతూ సైనథాన్ 2024 కార్యక్రమం వాక్ ఫర్ ఇన్ క్లూజివిటీ అనే థీమ్‌తో నిర్వహించడం జరుగుతుందన్నారు. 2 కిలోమీటర్ల సైన్‌మార్చ్, భారతీయ సంకేత భాషా(ఇండియన్ సైన్ లాంగ్వేజ్)పై ఇంటరాక్టివ్ సెషన్లు, విద్యార్థుల టాలెంట్ ప్రదర్శన, భారతీయ సంకేత భాషలో జాతీయ గీతాలపన కార్యక్రమాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హైదరాబాద్ సీసీసీ చైర్‌పర్సన్ హరీశ్‌కుమార్ సిరపు, బసవతారకం ఇండో అమెరికన్ హాస్పిటల్ ప్రతినిధి జేఎస్ఆర్ ప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్ హెల్త్ రన్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 22: సిడ్స్ ఫార్మ్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం 'హైదరాబాద్ హెల్త్ రన్'ను నిర్వహించారు. సిడ్స్ ఫార్మ్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిశోర్ ఇందుకూరి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. 10కే, 5కే, 2కే విభాగాల్లో నిర్వహించిన ఈ రన్‌లో నగరానికి చెందిన విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, రన్నర్లు 1500 మంది పాల్గొన్నారు. వివిధ కేటగిరిల్లో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

క్యాన్సర్‌పై అవగాహన రన్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 22 : యుక్త వయస్సులో పిల్లలకు వచ్చే క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ టీనేజ్, యంగ్ అడల్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన 10కే, 15కే రన్‌ను నిమ్స్ హాస్పిటల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు, నిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మెహర్ లక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రచన, ఎంఎన్‌జే ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రఘునాథ్ రావు, ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సీనియర్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎంవీటి కృష్ణ మోహన్, కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రి క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ శివకుమార్, వైజాగ్ మహాత్మాగాంధీ ఆస్పత్రి సీనియర్ మెడికల్ అంకాలజి డాక్టర్ స్టాలిన్ చౌదరి, డాక్టర్ ప్రకాశ్ చితాల్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బర్డ్స్ వాక్

బొటానికల్ గార్డెన్‌లో బర్డ్స్ వాక్ కార్యక్రమాన్ని జెండాఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం తనూజ

బొటానికల్ గార్డెన్‌లో పక్షుల సోయగాలు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 22: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో బర్డ్స్‌వాక్ (పక్షుల వీక్షణ) కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఎకోటూరిజం తనూజ జెండా ఊపి ప్రారంభించారు. నగరానికి చెందిన వివిధ ప్రాంతాల నుంచి 68 మంది పక్షుల వీక్షకులు, పక్షుల ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీఎస్ఎఫ్‌డీసీ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ ఎకోటూరిజం సుమన్ బొటానికల్ గార్డెన్ ప్రత్యేకత, ప్రాముఖ్యతల గురించి వివరించారు. బర్డ్స్ వాక్ సందర్శకులను రెండు గ్రూపులుగా విభజించి పక్షుల నిపుణులు ఉదయ్ నీతుపూడి, అపరంజని, హరిగోపాలచారి, అఖిల్ గైడ్లుగా వ్యవహరించి 75 థీమ్ పార్కులను తిప్పుతూ పక్షుల గురించి వివరించారు.

జలాశయాల సంరక్షణ అందరి బాధ్యత

ప్రపంచనదుల దినోత్సవంలో పాల్గొన్న ప్రొ.వేదకుమార్, సొసైటీల ప్రతినిధులు, విద్యార్థులు

సిటీబ్యూరో, సెప్టెంబర్22(నమస్తే తెలంగాణ)/శామీర్‌పేట: నదుల, జలాశయాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నదులను కాపాడుకోవడానికి ప్రజలంతా చేయిచేయి కలుపుదామంటూ ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు సంస్థలు పిలుపునిచ్చాయి. ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్, వరల్డ్ రివర్స్ డే, కెనడా సహకారంతో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట లేక్ అవుట్ ఫ్లో సదరన్ బండ్ ఒడ్డున వాకింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇంటాక్ జాతీయ పాలకమండలి సభ్యుడు , ఎఫ్‌బీహెచ్ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ మాట్లాడుతూ తెలంగాణలో మూడు సంవత్సరాలుగా ఫోరం తరపున ప్రపంచ నదుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నదుల పరిరక్షణ, పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో శామీర్‌పేట పరిరక్షణ కమిటీ కన్వీనర్ రవీంద్రారెడ్డి , వాటర్ హార్వెస్టింగ్‌నిపుణుడు సుభాశ్‌రెడ్డి, ఎఫ్‌బీహెచ్ సభ్యుడు నరహరి, ఎన్జీవో అనిల్, డీహెచ్ఏటీ ప్రతినిధి ఖైజర్‌బాషా, ఎఫ్‌బీహెచ్ కోఆర్డినేటర్ కట్టాప్రభాకర్‌లతో పాటు హైదరాబాద్ సిటీకాలేజి, దక్కన్ హెరిటేజ్ అకాడమీ, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కాలేజి, సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్, హిమాయత్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్‌స్కూల్, శ్రీసాయి విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు.

శామీర్‌పేట మండలం ఆలియాబాద్‌లో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జనం సందర్భంగా షేక్ మహబూబ్ జ్ఞాపకార్థం ఆయన మిత్రులు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు, ప్రజలు పాల్గొని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. శామీర్‌పేట, సెప్టెంబరు 22

కలుషితనీటిపై దృష్టి పెట్టండి

- జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సిటీబ్యూరో, సెప్టెంబరు 22 (నమస్తే తెలంగాణ) : రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం డైరెక్టర్లు, సీజీఎం, జీఎంలతో ఎండీ అశోక్‌రెడ్డి జూమ్ మీటింగ్ నిర్వహించారు. వర్షాలతో కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రిజర్వాయర్ల నుంచి సరఫరా చేసే నీటిలో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా చూసుకోవాలన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించి, క్లోరిన్ బిల్లలు పంపిణీ చేయాలన్నారు. అవసరమైతే ఆ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే గుర్తించిన వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో ఈఆర్టీ, ఎయిర్‌టెక్ మిషన్ సేవలతో సీవరేజీ సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎండీ ఆదేశించారు. అక్టోబరు 2వ తేదీ నుంచి ఇంకుడు గుంతల నిర్మాణం, పునరుద్ధరణ స్పెషల్ డ్రైవ్‌కు అన్ని రకాలుగా సిద్ధం కావాలని అధికారులను ఎండీ ఆదేశించారు.

'సదా స్మరామి నరేంద్రుడు' పుస్తకావిష్కరణ

మన్సూరాబాద్, సెప్టెంబర్ 22: ఎల్బీనగర్, నాగోల్‌లోని దేవకీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన బొందుగుల నరేంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరై నరేంద్రారెడ్డిపై రచించిన 'సదా స్మరామి నరేంద్రుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణతో ఆదివాసులకు న్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

చిక్కడపల్లి,సెప్టెంబర్ 22: ఎస్టీ వర్గీకరణ చేసి ఆదివాసులకు న్యాయం చేయాలని పలువురు వక్తలు అన్నారు. తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ(ఏజేఏసీ) తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఎస్టీ వర్గీకరణకు రౌండ్ టేబుల్ సమావేశంను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణ డిమాండ్ న్యాయమైందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అదే తరహాలో ఎస్టీలో ఏబీసీడీలుగా వర్గీకరిస్తే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణ కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని అన్నారు. సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు పట్టం ఉపేందర్, జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ, తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, సలహాదారుడు పొడుగు శ్రీనాథ్, రత్నం, వెంకటేశ్వర్లు, కొమురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకో క్రికెట్ అకాడమీ అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్ రెడ్డి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 22 : రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి చెందాలంటే జిల్లాకో అకాడమీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం అధ్యక్షుడు, శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో క్రికెట్‌కు ఆదరణ కరువైందని, గ్రామీణ క్రీడాకారులకు సరైన అవకాశాలు లభించడం లేదన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అవినీతిలో మునిగిపోయిదని, ఫలితంగా గ్రామీణ క్రికెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. దీనిపై బీసీసీఐకి లేఖ రాస్తామన్నారు. రాష్ట్ర క్రికెట్ జట్టుకు ప్రతి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేలా టీడీసీఏ పనిచేస్తుందన్నారు. అందరి సహకారంతో బీసీసీఐ గుర్తింపు సైతం తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ అసోసియేషన్ ప్రతినిధులు శివసేనా రెడ్డి, రాఘవ రెడ్డి, సోమేశ్వర రావు, భాస్కర్, మాజీ క్రికెటర్ వెంకటేశ్వర్లు, మతిన్, రామ్ నరసింహా రెడ్డి, బాలరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి రాఘవాచారి



పాల్గొన్న సీనియర్ సంపాదకుడు రాంచంద్రమూర్తి తదితరులు

మాదాపూర్, సెప్టెంబర్ 22: సమాజ హితం కోసం నిరంతరం పరితపించిన మహోన్నత వ్యక్తి విశాలాంధ్ర మాజీ సంపాదకుడు రాఘవాచారి అని సీనియర్ సంపాదకుడు రాంచంద్రమూర్తి అన్నారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో సంపాదకుడు రాఘవాచారి రాజ్యాంగం, న్యాయస్థానాలు, చట్టసభలు 9వ సంపుటిపై సమాలోచన సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ సంపాదకుడు రాంచంద్రమూర్తి విచ్చేసి ఎన్ సెంటర్ డైరెక్టర్ సురేశ్, విశాలాంధ్ర సంపాదకుడు రామారావు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, రాఘవచారి ట్రస్ట్ సభ్యుడు చందర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్ట్, జర్నలిస్ట్, సామాజిక, ఆధ్యాత్మిక అంశాలపైన రాఘవచారి స్పష్టంగా అన అభిప్రాయాలను వ్యక్తం చేసే వారని గుర్తు చేశారు.

మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 22 : ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో మాంగళ్య షోరూం 20వ స్టోర్‌ను సినీనటి కీర్తి సురేశ్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆదివారం ప్రారంభించారు. కీర్తి సురేశ్ మాట్లాడుతూ పట్టు,ఫ్యాన్సీ,కంచి ధర్మవరం,ఉప్పడ పట్టు చీరలతో పాటు అధునాతన కలెక్షన్స్ ,కిడ్స్, మెన్స్‌వేర్, ఉమెన్స్ వివాహాది శుభకార్యములకు ప్రత్యేక వస్త్ర ప్రపంచం మంగళ్య షాపింగ్ మాల్ అని పేర్కొన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు పి.ఎన్.మూర్తి, కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్,కాసం కేదారి నాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో 12 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు 20 స్టోర్‌లు ప్రారంభించామని మరో వారంలో నగరంలోని నార్సింగ్, మణికొండలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.